తార్నాక జంక్షన్‌కు విముక్తి!

వాహనదారుల్లో హర్షాతిరేకాలు • 8 ఏళ్ల అనంతరం మూసివేతను తొలగించనున్న అధికారులు

ప్రధాన రహదారుల ఆధునీకరణ, ట్రాఫిక్ సమస్యల నివారణకు జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం (సికింద్రాబాద్) జోనల్ కార్యాలయ అధికారులు చేపట్టిన 'కన్వర్‌జెన్స్' కమిటీల అధ్యయనాలు ఫలితాలను రాబడుతున్నాయి. ట్రాఫిక్ పోలీస్, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులను జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేస్తూ రహదారుల సుందరీకరణ, విస్తరణ పనులు వేగవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన 'కన్వర్‌జెన్స్' కమిటీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని తార్నాక కూడలి విషయంలో తీసుకున్న నిర్ణయం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ మొదటి వారంలో తార్నాక కూడలిని ప్రయాణికులకు అందుబాటులోకి తేనున్నారు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ అధికారులు కసరత్తును వేగవంతం చేశారు.
- సికింద్రాబాద్.


కూడలిహదారులను విస్తరిస్తున్న అధికారులు


తార్నాక కూడలిలో మూసివేసిన జంక్షన్

ఎనిమిదేళ్ల ఇబ్బందులు...

తార్నాక జంక్షన్‌ను ఎనిమిదేళ్ల క్రితం మూసివేశారు. మెట్రో పిల్లర్ల కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని భావించిన అప్పటి అధికారులు జంక్షన్‌ను మూసివేశారు. ప్రత్యామ్నాయంగా ఉప్పల్ వైపు ఐఐసీటీ, మెట్టుగూడ వైపు రైల్వే డిగ్రీ కళాశాల సమీపంలో 'యూ' టర్న్‌లను ఏర్పాటు చేశారు. దీంతో తార్నాక కూడలిలో ట్రాఫిక్ సమస్యలకు కొంత పరిష్కారం లభించినా... కిలో మీటర్ల మేర ప్రయాణించి వాహనాలు తిప్పుకొని రావడం వాహనదారులకు గుదిబండగా మారింది. భారీ వాహనాలు వచ్చి వెళ్లే సమయంలో తీవ్రంగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

ఫ్లై ఓవర్‌తో ప్రమాదాలు...

తార్నాక కూడలి మీదుగా ఫ్లై ఓవర్ ఉండడంతో ప్రమాదాలకు హేతువులుగా 'యూ' టర్న్‌లు మారుతున్నాయి. రెండు వైపులా ఫ్లై ఓవర్ ఎక్కి దిగే వాహనాలు వేగంగా వెళుతుండడం, కొంత దూరంలోనే యూ టర్న్‌లు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన యూ టర్న్‌ల వద్ద జరిగిన ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడ్డారు. ఉదయం, సాయంత్రం కార్యాలయాల సమయంలో సమస్యలు మరింత జటిలం అవుతున్నాయి. రెండు యూ టర్న్‌ల వద్ద పలువురు ట్రాఫిక్ పోలీసులు పహారా కాస్తే కానీ ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలను నివారించని పరిస్థితులు ఎదురవుతున్నాయి.

'కన్వర్‌జెన్స్' కమిటీ నిర్ణయంతో...

జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్, సిటీ ట్రాఫిక్ అదనపు కమిషనర్ నేతృత్వంలోని కన్వర్‌జెన్స్ కమిటీ తార్నాకలో పర్యటించింది. ఇక్కడ ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల గురించి అధ్యయనం చేసింది. వీటిని నివారించడానికి కోసం యూ టర్న్‌లను తొలగించి, ఎనిమిదేళ్ల క్రితం మూసివేసిన తార్నాక జంక్షన్‌ను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నారు. కన్వర్‌జెన్స్ కమిటీ నిర్ణయం పట్ల ప్రయాణికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు...

- తార్నాక జంక్షన్ పునరుద్ధరణ కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేర్రాజు నేతృత్వంలో పనులు ప్రారంభమయ్యాయి. కూడలి ఆధునీకరణ, విస్తరణ కోసం రూ.40 లక్షలు కేటాయించారు.
- ఇప్పటికే కూడలి నుంచి సెయింట్ ఆన్స్‌రోడ్‌లోని రహదారి, ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. మరో నాలుగు భవనాలను పాక్షికంగా తొగించేందుకు కసరత్తు చేస్తున్నారు.
- కూడలిలోని రెండు పెట్రో బంకుల యజమానులు చెరో ఆరు ఫీట్ల స్థలాన్ని ఆక్రమించినట్టు, మరో టిఫిన్ సెంటర్ యజమాని ఎనిమిది ఫీట్ల రహదారి స్థలాన్ని ఆక్రమించినట్టు గుర్తించిన అధికారులు త్వరలో ఆక్రమణలు తొలగించనున్నారు.
- ట్రాఫిక్ ఐల్యాండ్, కూడలికి నాలుగు వైపులా బస్‌బేలు, ఫుట్‌పాత్‌ల ఏర్పాటు కోసం యూనివర్సిటీ అధికారుల నుంచి స్థల సేకరణ కోసం చర్యలు తీసుకుంటున్నారు. మూడు రోజుల్లో విస్తరణ పనుల కోసం టెండర్లు ఖరారు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

అధికారుల చర్యలు అభినందనీయం



తార్నాక జంక్షన్ మూసివేతతో ఎనిమిదేళ్లుగా ఎన్నో కష్టాలు అనుభవించాం. కూడలి దాటడం కోసం మూడు కిలో మీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఎనిమిదేళ్లుగా ఎన్నో ప్రమాదాలు జరిగి ఎందరో ప్రయాణికులు మృతి చెందారు. ఈ నెలాఖరు కల్లా జంక్షన్ నుంచి రాకపోకలు పునరుద్ధరిస్తుండడం అభినందనీయం.
– సందీప్, వాహనదారుడు

డిసెంబర్ 1 నుంచి రాకపోకలు



ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పూర్తిస్థాయి అధ్యయనం చేసిన మీదట తార్నాక జంక్షన్‌ను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నాం. విస్తరణ పనులు తుదిదశకు చేరాయి. ఆధునీకరణ, బస్‌బేల ఏర్పాటు పనులు కొద్ది రోజుల్లో పూర్తిచేస్తాం. ట్రాఫిక్ సమస్యలు కూడలిలో ఎదురవకుండా ఉండేందుకు కసరత్తు చేస్తున్నాం. డిసెంబర్ 1 నుంచి జంక్షన్‌ను వాహనదారులకు అందుబాటులోకి తెస్తాం.
– ఎస్.రవికిరణ్, జోనల్ కమిషనర్

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి అమర్లపురి వందన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్, ఏదైన డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయి ఉండి 18 నుంచి 36 ఏళ్ల లోపు నిరుద్యోగులు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రారంభ వేతనం రూ.12,500 నుండి వారి అర్హత నైపుణ్యాన్ని అనుసరించి రూ.14 వేలతో పాటు ఇతర ఇన్‌సెంటీవ్స్ ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు గురువారం ఉదయం 11 గంటలకు విజయనగర్‌కాలనీలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 83284 28933 లో సంప్రదించాలని సూచించారు.

నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి

గన్‌ఫౌండ్రీ: సమాజంలో విద్యార్థులు డిగ్రీ పట్టాలతో పాటు అవసరమైన నైపుణ్యాలను కలిగి ఉన్నప్పుడే మెరుగైన అవకాశాలు అందుకోగలరని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.జగదీశ్వర్‌రావ్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో నిజాం కళాశాల స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ఆకాశమే హద్దుగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని దక్కించుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొ. కుమార్ మాట్లాడుతూ.... నిజాం కళాశాలతో పాటు ఓయూలో పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా హాస్టల్ వసతితో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ యూజీ కోర్సులలో మెరిట్ మార్కుల్ సాధించిన 49 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు.

టీజీపీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కనకం కొమురెల్లి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (టీజీపీఏ) నూతన కమిటీని బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకుంది. సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎస్ లక్ష్మారెడ్డి ప్రకటించారు. అధ్యక్షుడిగా కనకం కొమురెల్లి, ప్రధాన కార్యదర్శిగా టి.అశోక్‌రెడ్డి, టీఏఎస్ఆర్ గుప్తా, కార్యనిర్వహణ అధికారిగా జి.సూర్యకళ, కోశాధికారి జయంత్ ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్‌స్వామి, కె.లక్ష్మణ్‌రావు, ఎం.స్వర్ణకుమారి, జయసేన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కె. జానకి, ఝాన్సీ లక్ష్మీబాయి, జి. యాదగిరి, డి. ప్రవీణ్ కుమార్‌లు ఎన్నికయ్యారు.

- ఈ సందర్భంగా అధ్యక్షుడు కనకం కొమురెల్లి మాట్లాడుతూ... పీఎస్ జీహెచ్ గచ్చిబౌలి మ్యాక్ హౌసింగ్ సొసైటీ సభ్యులమైన తమకు 2008లో రంగారెడ్డి జిల్లా గోపన్నపల్లి గ్రామంలో 189ఎకరాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. లాటరీలో ప్లాట్‌లు దక్కని కొంతమంది సభ్యులు కోర్టులో కేసులు వేయడంతో ఇళ్లు నిర్మించుకోలేదన్నారు. ఈ నెపంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమకు ఇచ్చిన భూములను లాక్కుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమత్తం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. బసంత్‌కాలనీ ఫీడర్ పరిధిలోని లింగంపల్లి, వైశ్యహాస్టల్, వెంకటరమణ థియేటర్, జైన్ మందిర్, కాచిగూడ ఎక్స్‌రోడ్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సర్వేలో భాగస్వాములు కావాలి

కాచిగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి మన్నె మహేష్‌యాదవ్ అన్నారు. బుధవారం చెప్పల్‌బజార్‌లో ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి కులగణన సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వం పూర్తి గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరుగుతుంటే కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఎం.శ్యామ్ రావు, రమణారెడ్డి, నర్సింగ్‌రావు, ఆశా వర్కర్ సభిత తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి పైపులైన్ పనులు ప్రారంభం

కాచిగూడ: బర్కత్‌పుర తెలంగాణ యువతి మండలి వద్ద రూ.47లక్షలతో వరద నీటి పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం ఈ పనులను ప్రారంభించారు. అభివృద్ధి పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమా, నాయకులు ఎర్ర భీష్మదేవ్ తదితరులు పాల్గొన్నారు.

'మేమెంతో.. మాకంతా.!' రిజర్వేషన్లు కల్పించాలి

కాచిగూడ: జనాభా ప్రాతిపదికన బీసీలకు 'మేమెంతో.. మాకంతా.!'రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల నిర్ధారణకు ఏర్పాటు చేసిన డెడికేటెడ్ బీసీ ప్రత్యేక కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావును బుధవారం మాసాబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. బీసీల్లోని 54 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. సంచారా జాతులకు పెద్దపీట వేయాలని అన్నారు. బీసీలను విస్మరిస్తే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

మహిమ కీర్తనకు గోల్డ్ మెడల్


రైఫిల్ షూటింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన కళాశాల విద్యార్థిని మహిమ కీర్తన

కాచిగూడ: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ ఇంటర్ జూనియర్ కాలేజ్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్, సెలక్షన్స్ 2024–25 బుధవారం నాంపల్లిలోని మదీనా స్కూల్‌లో జరిగాయి. అండర్ 19 ఇయర్స్ విభాగం 10 మీటర్స్ రైఫిల్ షూటింగ్‌లో కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని సిరంగి మహిమ కీర్తన గోల్డ్‌మెడల్ సాధించింది. అదే కాలేజీకి చెందిన ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని అవికా కన్వాల్ సిల్వర్ మెడల్ దక్కించుకుంది. మొదటి, రెండో బహుమతులు కాచిగూడ జూనియర్ కాలేజీకి రావడంతో విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్స్, తోటి విద్యార్థులు అభినందించారు. డీఆర్‌డీఓ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ టెక్నికల్ ఆఫీసర్ ప్రవీణ్ సిరంగి, వికారాబాద్ జిల్లా మర్పిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వైఎస్ స్వర్ణలతల కుమార్తె మహిమ కీర్తన. ఉన్నత స్థానంలో ఉన్న తల్లిదండ్రులు తమ కుమార్తెను ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేర్పించి చదివించడం అందరికి ఆదర్శనీయం. మహిమ కీర్తన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


అడిక్‌మెట్ డివిజన్ బాలాజీనగర్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారామే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని బాలాజీనగర్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలోని బస్తీలు, కాలనీలను అభివృద్ధి పరుస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఎప్పటికప్పుడు పర్యటనలు చేస్తున్నామని తెలిపారు. అక్కడ ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయిస్తున్నామని అన్నారు. ఈ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ శివప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహా, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేందర్, శ్యాంసుందర్, బస్తీవాసులు మహేష్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, నర్సింగ్‌రావు, రమేష్, భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తారస్థాయికి ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ


ఆస్పత్రుల దోపిడీ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీవైఎల్, పీఓడబ్ల్యూ ప్రతినిధులు

ముషీరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ తారస్థాయికి చేరిందని.. ఈ దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని ప్రొగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప డిమాండ్ చేశారు. బుధవారం సంఘాలు ముద్రించిన ప్రచార పోస్టర్స్‌ను వారు ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందక ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. వైద్య పరీక్షలు, మందుల పేరుతో లక్షల రూపాయల బిల్లులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్ అవకతవకలు జరుగుతున్నాయని దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్లపై ప్రభుత్వం నియంత్రణ ఉండాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ దోపిడీని అరికట్టేందుకు పీవైఎల్, పీఓడబ్ల్యూ రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఉద్యమం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. రవికుమార్, బీఎస్‌కృష్ణ, లక్ష్మీబాయి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలకు లలితారాణి



కాచిగూడ: కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని లలితారాణి జాతీయ స్కూల్ గేమ్స్ అండర్–19 బాలికల ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈనెల 15 నుంచి 19 వరకు గుజరాత్‌లోని నదియాలో జరుగుతాయి. లలితారాణి ప్రస్తుతం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బీపీసీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. జాతీయ ఆర్చరీ టోర్నమెంట్‌కు లలితారాణి ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి. ఫిజికల్ డైరెక్టర్ డా. లక్ష్మయ్య, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పతకాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు.

నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కలమెత్తిన యోధుడు కాళోజీ


చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మజ, ప్రతిభారెడ్డి

చిక్కడపల్లి: నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కలం ఎత్తిన యోధుడు ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పాట్లూరి పద్మజ అన్నారు. బుధవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో సాయంత్రం కాళోజీ నారాయణరావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రతిభారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య పరాశ్రీ స్వామీజీకి జ్ఞాన సంపూర్ణానంద పురస్కారం

గన్‌ఫౌండ్రీ: గురువులను సత్కరించుకోవడం శిష్యుల బాధ్యతని అందులో అద్భుతమైన దార్శనికత దాగి ఉందని అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామీజీ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి ప్రవచనం, గురువందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీని జ్ఞాన సంపూర్ణానంద పురస్కారంతో సత్కరించారు. అంతకు ముందు ప్రముఖ గాయని పి.సుశీల 89వ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్ గుప్తా, కళా పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, ఎల్ఐసీ అధికారి సుబ్రమణ్యం, శృతిలయ కార్యదర్శి ఆమని, కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ గాలికి.!

- బస్తీలు, మురికివాడల్లో కనిపించని పరిశుభ్రత
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పారిశుద్ధ్యం పడకేసింది. ఏ బస్తీ, ఏ కాలనీలో చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి కనిపిస్తోంది. నిత్యం వీధులను శుభ్రం చేసి చెత్తను తొలగించాల్సిన పారిశుద్ధ్య విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా నల్లకుంట రైల్వే ట్రాక్ పక్కన, తిలక్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన చెత్తకుప్పలుగా పేరుకుపోతోంది. అలాగే ఫీవర్ ఆసుపత్రి సిగ్నల్స్ నుంచి తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వైపు వచ్చే రహదారిలో గల వినాయక ఆటోమోబైల్స్ సమీపంలోని వేణు గ్రాఫిక్స్ వీధిలో నెల రోజులకు పైగా చెత్తను తొలగించలేదు. కొందర స్థానికులు నిర్లక్ష్యంగా తమ ఇళ్లల్లోని చెత్తాచెదారాన్ని పడేసి వెళ్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెత్తాచెదారం లేకుండా చూడాలని కోరుతున్నారు.


తిలక్‌నగర్ మెయిన్ రోడ్డు సమీపంలోని వేణు గ్రాఫిక్స్ లేన్‌లో చెత్తాచెదారం

నేడు గిరిజన సంఘాల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ నాయక్, రాంబల్ నాయక్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కొడంగల్‌లో ఫార్మా కంపెనీ ఏర్పాటు, నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు కోసం ఈనెల 14వ తేదీన మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సేవాలాల్ సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ తెలిపారు. బుధవారం సుందరయ్యపార్కు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... కొడంగల్‌లో గిరిజనుల భూములను నిర్దాక్షిణ్యంగా లాక్కోవడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొడంగల్‌లో లగచెర్ల రోటీబండా తండా, పులిచర్ల కుంట తండా, గడ్డమీది తండా, మౌసమ్మ గడ్డ తండా, ఈదుల కుంట తండా, హక్కీంపేట, పోలేపల్లి, ఈదులపల్లి తదితర తండాలను సందర్శించి వాస్తవాలను తెలుసుకునేందుకు ప్రముఖులతో నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, పాశం యాదగిరి, ప్రొ. కోదండరాం, హరగోపాల్, ప్రొ. కాశీం, ప్రొ. భంగ్యాభూక్యా తదితరులను సమావేశానికి ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సుకు ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున హాజరై గిరిజనులకు అండగా ఉండాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో హరినాయక్, ప్రవీణ్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

వైభవంగా తులసి లగ్నం

ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయంలో బుధవారం సాయంత్రం కార్తీక శుద్ధ ద్వాదశిని పురస్కరించుకొని తులసి లగ్నం నిర్వహించారు. అదే విధంగా వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.
– చిక్కడపల్లి


లక్ష్మీగణపతి ఆలయంలో తులసి లగ్నంలో భక్తులు